రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 21, వంకాయ 45, బెండ 50, పచ్చిమిర్చి50, కాకర 65, బీర 45, క్యాలీఫ్లవర్ 23, కేబేజీ 18, క్యారెట్ 39. దొండ 45, ఆలు 28, ఉల్లి 26, గోకర 50, దోస 35, సొర 15, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 60, అర్వి 55, మునగ 75, చిలగడదుంప 50, బీట్‌రూట్ 23, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 75. గురువారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

వైభవంగా తిరుప్పావై ప్రవచనోత్సవాలు



మహిళలకు పసుపు, కుంకుమ అందజేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో తిరుప్పావై ప్రవచనోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆండాళ్ నిలయం నిర్వాహకులు మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, రామకృష్ణ, రూపాదేవి తదితరులు ఉన్నారు.

పార్కింగ్ అడ్డాగా సైక్లింగ్ ట్రాక్!

- అసంపూర్తిగా నిర్మాణం
- బిల్లులు చెల్లించపోవడంతో పనులు నిలిపేసిన కాంట్రాక్టర్?
- నిర్మాణం పూర్తైన ట్రాక్‌పై వాహనాల అక్రమ పార్కింగ్
- అడ్డుకోని జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు



ఎల్‌బీనగర్‌లో పార్కింగ్ కేంద్రంగా మారిన సైక్లింగ్ ట్రాక్

నాగోలు: నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజల కోసం రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లను జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మిస్తున్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సైకిల్ ట్రాక్‌లను అభివృద్ధి చేసి నగర వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎన్నికలకు ముందు హడావుడిగా పనులు చేపట్టారు. ఇదే క్రమంలో ఎల్‌బీనగర్ పరిధిలో చేపట్టిన సైకిల్ ట్రాక్ నిర్మాణాన్ని కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేశాడు. అసంపూర్తిగా ఉన్న ఈ సైక్లింగ్ ట్రాక్ వాహనాల అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఉన్నతాధికారులు త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఈ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

- ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా నాగోలు నుంచి ఎల్‌బీనగర్ వరకు సైకిల్ ట్రాక్ నిర్మించాలని నిర్ణయించిన అధికారులు 8 నెలల క్రితం పనులు ప్రారంభించారు.
- రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను తొలగించి ఫుట్‌పాత్‌కు వాహనాలు వెళ్లే రోడ్డు మధ్య సుమారు పది అడుగుల వెడల్పులో ట్రాక్ నిర్మాణం మొదలు పెట్టారు. నాగోలు నుంచి ఆదర్శనగర్ వరకు, ఎల్‌బీనగర్ శివగంగ కాలనీ దగ్గర కొంత మేరకు పనులు చేసిన కాంట్రాక్టర్ మధ్యలో ఆపేశాడు.
- గత ప్రభుత్వంలో పనులు మొదలెట్టిన కాంట్రాక్టర్ ఇప్పుడు చేయకపోవడంతో ఎక్కడిక్కడే నిలిచిపోయి. అర్ధంతరంగా పనులు నిలిపివేసి ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సైకిల్ ట్రాక్ పూర్తిగా ఉపయోగంలోకి రాకపోవడంతో కొంత మంది అక్కడ తమ వాహనాలను నిలుపుకుంటూ పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించుకుంటున్నారు.
- జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు పట్టించుకోక పోవడంతో కోట్లది రూపాయలతో నిర్మించిన సైకిల్ ట్రాక్ అక్రమ పార్కింగ్‌కు అడ్డగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- అధికారుల నిర్లక్ష్యం వల్ల అసలు ప్రారంభించకుండానే ట్రాక్ ధ్వంసమయ్యే ప్రమాదం ఉందంటున్నారు.
- కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడంతోనే పనులను పూర్తి చేయడం లేదని తెలుస్తోంది.
- సైక్లింగ్ ట్రాక్ పనులను కాంట్రాక్టర్ నిలిపి వేయడంతో ఈ పనులు అసలు పూర్తవుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
- జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకొని సైక్లింగ్ ట్రాక్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఎల్‌బీనగర్‌లో మధ్యలో ఆగిపోయిన సైక్లింగ్ ట్రాక్ పనులు

షణ్ముఖ కుటుంబానికి కేంద్రమంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

చైతన్యపురి: అనారోగ్యంతో ఇటీవల కన్నుమూసిన బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామోజు షణ్ముఖ (జన్నన్న) కుటుంబ సభ్యులను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం షణ్ముఖ దశదిన కర్మ సందర్భంగా చైతన్యపురి ప్రభాత్‌నగర్‌లోని ఆయన నివాసంలో సతీమణి శోభారాణి, కూతురు తేజస్విలను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ, హిందూవాహిని, బజరంగ్‌దళ్, బీజేపీల బలోపేతానికి షణ్ముఖ తన జీవితాన్ని ధారపోశారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని కిషన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ పూర్వ ఇన్‌చార్జి కాచం సత్యనారాయణ, బీజేజీ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



లిటిల్ ల్యాంబ్ చర్చిలో దుస్తులు పంపిణీ చేసిన ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి, చర్చి ప్రతినిధులు

వనస్థలిపురం: రోజు రోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, అలాగే మైనర్లు వాహనాలు నడపకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు ప్రభుత్వం పంపించిన దుస్తులను మంగళవారం రాత్రి వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో పంపిణీ చేశారు. ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్థానికంగా ఉన్న 14 చర్చీలకు సంబంధించిన సభ్యులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాథోడ్, పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సుదర్శన్‌రావు, చర్చి కమిటీ అధ్యక్షుడు టీఎస్ బాబూరావు, కార్యదర్శి ఎన్.జాన్, కోశాధికారి ఎం.సురేష్‌కుమార్, ఏలియా, రాజు, ఎస్.జాన్, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సాయినగర్ చిల్డ్రన్ పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ సాయినగర్‌లోని చిల్డ్రన్ పార్కు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లోని అన్ని కాలనీల్లో పార్కు స్థలాలను ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామన్నారు. కాలనీవాసులు లక్ష్మణాచారి, వేణుగోపాల్‌చారి, అంజయ్య, గోవర్ధన్‌రెడ్డి, గంపా భాగ్యశ్రీ, బీజేపీ నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర వచ్చేలా చూడండి

- మార్కెట్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల నుంచి మూడు నెలల పాటు మిర్చి దిగుమతి ఉంటుందని, రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా మార్కెట్ అధికారులు కృషి చేయాలని మార్కెట్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ ఆధ్వర్యంలో మిర్చి కమీషన్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మిర్చి సీజన్ మొదలైనందు వల్ల రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించి గిట్టుబాటు ధర వచ్చేలా అధికారులు, కమీషన్ ఏజెంట్లు రైతులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, కమీషన్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుకుల కళాశాల ఇగ్నైట్ ఫెస్ట్



హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని గిరిజన గురుకుల కళాశాలలో రీజినల్ స్థాయి ఇగ్నైట్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. పలు గిరిజన కళాశాలలకు చెందిన విద్యార్థులు ఆటలు, పాటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురుకుల కళాశాలల చీఫ్ సెక్రెటరీ నవీన్ నికోలస్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌సీఓ కల్యాణి, ప్రిన్సిపాల్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగిపొర్లుతూ రోడ్లపై ఏరులై పారుతోందని, సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అన్నారు. మురుగు నీరు వల్ల దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని డివిజన్‌లోని అనేక ప్రాంతాల ప్రజలకు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యను తాను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారన్నారు. బుధవారం జలమండలి అధికారులు, సిబ్బంది హస్తినాపురం రావడంతో తాను దగ్గరుండి డ్రైనేజీకి మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరింపజేశానని సత్యంచారి తెలిపారు. డివిజన్‌లో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

స్ట్రీట్‌లైట్స్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న స్ట్రీట్‌లైట్స్ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో స్ట్రీట్‌లైట్స్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు ఇవ్వాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. స్ట్రీట్‌లైట్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో స్ట్రీట్‌లైట్ ఈఈ పున్న నాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జీతాలు ఇవ్వడం లేదని స్ట్రీట్‌లైట్స్ సిబ్బంది కొన్ని రోజులుగా నిరసనలు చేస్తుండటంతో కొత్తపేట డివిజన్‌లో కొంతకాలంగా వీధి దీపాలు వెలగడం లేదన్నారు. దీంతో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట కాలనీల్లో చీకటి నెలకొనడంతో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ జరుగుతున్నాయన్నారు. కాలనీల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పరిష్కరించాలని కోరారు. రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తానని ఈఈ పున్న నాయక్ హామీ ఇచ్చారని పవన్‌కుమార్ తెలిపారు. అనంతరం కార్పొరేటర్ నిరసన తెలుపుతున్న వీధి దీపాల కాంట్రాక్ట్ ఉద్యోగస్తులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, మోహన్ రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల ముందు ర్యాంపులను స్వచ్ఛందంగా తొలగించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లోని హయత్‌నగర్ పరిధిలోని పవనగిరికాలనీ ఫేజ్–3, సిరిహిల్స్‌కాలనీ లింక్‌ను కలుపుతూ నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీల్లో ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న ర్యాంపులను, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా తొలగించి విశాలమైన రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు. శివంహిల్స్, శివగంగకాలనీ, శ్రీకృష్ణానగర్, సిరిహిల్స్ లింక్‌రోడ్డును డ్రైనేజీ పనులు పూర్తైన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, బడుగు హరినాథ్, సంపత్‌గౌడ్, కరుణాకర్, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, పారంద సాయి, కడారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళా సమాఖ్య గ్రేటర్ అధ్యక్షురాలిగా శ్రీనిధి

చంపాపేట: గ్రేటర్ హైదరాబాద్ జాతీయ బీసీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా చంపాపేట డివిజన్ రెడ్డి బస్తీకి చెందిన పాల్వాయి శ్రీనిధి నాయీబ్రాహ్మణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు నియామక పత్రాన్ని జాతీయ బీసీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి బుధవారం చంపాపేటలోని సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో అందజేశారు. అనంతరం శ్రీనిధి మాట్లాడుతూ... మహిళల రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.



శ్రీనిధికి నియామక పత్రం అందజేస్తున్న భాగ్యలక్ష్మి

నేడు మంత్రి సీతక్క రాక

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవన్‌లో గురువారం నిర్వహించే లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలకు రాష్ట్ర స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరవుతారని వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, వికలాంగుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్ కేఆర్‌ఎస్ లక్ష్మీదేవి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. వివిధ రంగాలలో నైపుణ్యం చూపిన అంధులకు మంత్రి చేతుల మీదుగా సన్మానం చేస్తారన్నారు. అందులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు తెలిపారు.

నేడు అంజిరెడ్డి కాలనీలో అయోధ్య అక్షింతల పంపిణీ

చంపాపేట: డివిజన్ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి ఇంటింటికీ అయోధ్యలో శ్రీరామ మందిర శంకుస్థాపన సమయంలో పూజకు ఉపయోగించిన అక్షింతలను అందచేస్తారని కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా కాలనీలోని శ్రీకోదండ రామాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజల చేసి, అనంతరం శ్రీరామభక్తులు సంకీర్తనలు చేస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. పరిసర కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సీఎంకు శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీఆర్‌టీయూ వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వర్‌రెడ్డి.

– హస్తినాపురం

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపాలి: ఏబీవీపీ



డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

మలక్‌పేట: విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వచ్చే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని, సమయానికి బస్సులు రాక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సులు నడపాలని అధికారులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అభిషేక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమాన్, కీర్తన, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు



సాయినగర్‌కాలనీలో శ్రీరాముని అక్షింతలు పంపిణీకి సిద్ధమైన దుర్గాదేవి ఆలయ కమిటీ నేతలు, శ్రీరామభక్తులు



చైతన్యనగర్‌లో శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: త్వరలో అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలో బుధవారం శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామ మందిరం ప్రారంభం సందర్భంగా వాడ వాడలా శ్రీరాముని అక్షింతలతో పాటు రామలీల చిత్రపటం, ఆహ్వాన పత్రికను భక్తులందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు. కాలనీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, సాయిబాబాగుడి చైర్మన్ రాంరెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వరావు, వేణుగోపాల్‌రావు, నర్సింహారెడ్డి,సుధాకర్‌గుప్తా పాల్గొన్నారు.

శ్రీకృష్ణానగర్‌లో...

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు, శ్రీకృష్ణానగర్ కాలనీ అధ్యక్షుడు కుట్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణానగర్ కాలనీలో అయోధ్య శ్రీరాముని అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. కాలనీ నాయకులు అంజయ్య, వెంకటేష్, ఉపేందర్‌రెడ్డి, యాదగిరిరావు, కైలాష్, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భవానీనగర్‌లో...

మన్సూరాబాద్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బుధవారం భవానీనగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి అందజేశారు. శ్రీరాముని అక్షింతలు ప్రతి ఇంటికి చేరేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

సాయినగర్‌కాలనీలో..

నాగోలు డివిజన్‌లోని సాయినగర్ కాలనీలో శ్రీదుర్గాదేవి ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామభక్తులు శ్రీరాముని అక్షింతలు ఇంటింటికీ అందజేశారు. ఆలయ కమిటీ నేతలు గణేష్‌యాదవ్, హనుమంతరావు, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయురాలు సావిత్రీబాయి పూలే

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ



మన్సూరాబాద్‌లో సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్వే, తదితరులు



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి



నాగోలు సాయినగర్‌లో .. నివాళులర్పిస్తున్న బ్రహ్మయ్య తదితరులు

మన్సూరాబాద్: సావిత్రీబాయి పూలే జీవితాన్ని నేటి సమాజం ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ పిలుపునిచ్చారు. సావిత్రీబాయి భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని, స్త్రీ విద్య కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. పూలే యువజన సంఘం, ఓబీసీ పీపుల్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మన్సూరాబాద్ సహారారోడ్డులోని సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద ఆమె జయంతి వేడుకలు నిర్వహించారు. సావిత్రీబాయి విగ్రహానికి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్దగౌని లక్ష్మీప్రసన్న గౌడ్, అఖిల భారత విశ్వకర్మ మహాసభ అధ్యక్షుడు జగన్నాథం, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, బీసీ సంఘాల నేతలు సావిత్రీబాయి విగ్రహానికి నివాళులర్పించారు. పూలే యుజన సంఘం నేతలు మేడిగ శ్రీధర్, శనిగరపు స్వామి, కేవీ గౌడ్, జైహింద్‌గౌడ్, సాయిరామ్, సావిత్రి, కదిరే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలి

సైదాబాద్: సావిత్రీబాయి పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. సావిత్రీబాయి జయంతి సందర్భంగా సింగరేణి కాలనీలోని గిరిజన భవన్ వద్ద ఆమె చిత్రపటానికి ఆయన సీపీఐ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమతం యాదగిరి, ఆర్.శంకర్‌నాయక్, రాజు నాయక్, అంజయ్య, సక్రీబాయి, అమీనా, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో...

హయత్‌నగర్‌లో దళిత బహుజన సంఘాల నాయకుడు ఎర్ర రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన సావిత్రిబాయి పూలే వేడుకలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొని సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు ఎత్తరి భీంరావు, పారంద మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం: వనస్థలిపురం యశోద నగర్‌లోని ప్రజా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సావిత్రీబాయి చిత్రపటానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.దాసరి అజయ్‌కుమార్ యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్, ప్రశాంత్ యాదవ్ పాల్గొన్నారు.

నాగోలు సాయినగర్‌లో...

నాగోలు: సాయినగర్ కాలనీలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీ దేవి, సూపర్ కిట్ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పలత. సంఘం నాయకులు నాగిళ్ల యాదగిరి, వెంకటేష్. జూపల్లి రామకృష్ణ అబ్బి రవి పాల్గొన్నారు.

బస్తీ సమస్యలపై ప్రజాపాలన సభలో వినతి

మలక్‌పేట: గడ్డి అన్నారం బస్తీలోని సమస్యలను పరిష్కరించాలని బస్తీవాసులు అధికారులు కోరారు. బుధవారం బస్తీలోని రాజీవ్ గాంధీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన సభలో అధికారులకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీ ప్రతినిధులు జి.శ్యామ్ రావు, సంగేపాక ధర్మేందర్ మాట్లాడుతూ, కమ్యూనిటీ హాల్‌పై అంతస్తుల నిర్మాణం, సీసీ రోడ్లు, మ్యాన్‌హోళ్ల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజాపాలన ద్వారా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు అనంతయ్య, బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



'ప్రజా పాలన'లో వినతి పత్రం అందజేస్తున్న గడ్డిఅన్నారం బస్తీ వాసులు